భీమవరం ఉష్ణోగ్రతలు
గరిష్ఠం: 37.0
కనిష్ఠం: 28.0

ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పశ్చిమ గోదావరి
జిల్లా వార్తలు
3
సోమవారం 19 మే 2025



తణుకు పట్టణంలో 400 అడుగుల జాతీయ జెండాతో భారీ ర్యాలీ



తణుకు తిరంగా యాత్రలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, నేతలు



నరసాపురం పట్టణంలో విప్ నాయకర్, పొత్తూరి, నేతలు

తిరంగా యాత్ర

ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని జిల్లాలో పలు చోట్ల ఆదివారం తిరంగా యాత్ర నిర్వహించారు. తణుకు పట్టణంలో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 400 అడుగుల జాతీయ జెండాతో నిర్వహించిన ర్యాలీ జై భారత్, జై జవాన్ నినాదాలతో హోరెత్తింది. నరసాపురం పట్టణంలో ఎమ్మెల్యే, విప్ బొమ్మిడి నాయకర్ ఆధ్వర్యంలో జాతీయ జెండాలు చేతబట్టి భారత సైనికులకు మద్దతుగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. పాలకోడేరు మండలంలో పలువురు నాయకులు, ప్రజలు తిరంగా యాత్ర నిర్వహించారు.

4



ఆక్రమిత భూములను పరిశీలిస్తున్న కలెక్టర్

ఆక్రమణలు తొలగిస్తాం

కలెక్టర్ నాగరాణి

పాలకోడేరు, మే 18(ఆంధ్రజ్యోతి): గొల్లలకోడేరు యనమదుర్రు డ్రెయిన్ గట్టుపై ఉన్న ఆక్రమిత స్థలాలను కలెక్టర్ చదలవాడ నాగరాణి ఆదివారం పరిశీలించారు. ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలు తొలగించి త్వరలో స్వాధీనం చేసుకుంటామని తెలిపారు. గొల్లలకోడేరు గ్రామంలో వివిధ ప్రాంతాల్లో ప్రభుత్వ ఖాళీ భూములను పరిశీలించి ఎవరైనా ఆ భూములను ఆక్రమిస్తే ప్రభుత్వ పరంగా కఠిన చర్యలు చేపడతామని నోటీసు బోర్డులు ఏర్పాటు చేయాలని పంచాయతీ కార్యదర్శికి ఆదేశించారు. గొల్లలకోడేరులో సీసీ రోడ్డుపై రోడ్డు వేయడంతో పంచాయతీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ రహదారిని పరిశీలించిన అనంతరమే బిల్లులను ఆమోదించాలన్నారు. ఎక్కడ అవినీతి జరిగినా సహించేది లేదని తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో ప్రవీణ్ కుమార్‌రెడ్డి, తహసీల్దార్ ఎన్.భారతి విజయలక్ష్మి, ఎంపీడీవో వి.రెడ్డయ్య, కొత్తపల్లి నాగరాజు, ఇరిగేషన్ డీఈ, అధికారులు పాల్గొన్నారు.

నేడు యలమంచిలి, అత్తిలి ఎంపీపీ ఎన్నిక

యలమంచిలి, మే 18 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ మేరకు మండల ప్రజాపరిషత్ అధ్యక్షురాలి ఎన్నిక సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో ఎస్.ప్రేమాన్విత తెలిపారు. మార్చి 26, 27వ తేదీల్లో ఎంపీపీ ఎన్నిక ప్రక్రియ చేపట్టారు. వైసీపీ పార్టీ అభ్యర్థికి ఓటు వేయాలని బెదిరింపు కాల్స్ వస్తున్నాయని, ఎన్నికను వాయిదా వేయాలని సభ్యులు కోరడంతో 26న జరగాల్సిన ఎన్నిక 27వ తేదీకి వాయిదా వేశారు. అయినా మళ్లీ బెదిరింపులతో పాటు ఎన్నికల అధికారి అస్వస్థతకు గురికావడంతో ఎన్నిక వాయిదా పడింది. మొత్తం 17 మంది ఎంపీటీసీ సభ్యులకు ఎన్డీఏ కూటమికి నలుగురు ఎంపీటీసీ సభ్యులు ఉన్నారు. వైసీపీకి ఉన్న 13 మంది ఎంపీటీసీ సభ్యుల్లో మేడపాడు ఎంపీటీసీ మార్చి 27న టీడీపీలో చేరారు. తమకు స్పష్టమైన మెజారిటీ ఉన్నప్పటికీ ఎంపీపీ ఎన్నికను వాయిదా వేశారని, తమకు న్యాయం చేయాలని వైసీపీ ఎంపీటీసీలు వినుకొండ ధనలక్ష్మి, నల్లి సంధ్యారాణి హైకోర్టును ఆశ్రయించారు. అనంతరం ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇవ్వడంతో సోమవారం ఎంపీపీ ఎన్నిక జరగనుంది.

● అత్తిలి: మండల పరిషత్ అధ్యక్షుడు, ఉపాధ్యక్ష పదవులకు సోమవారం ఉప ఎన్నిక నిర్వహించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. మార్చి 27న ఎన్నికకు అధికారులు ఏర్పాట్లు చేసినప్పటికీ అధికార కూటమి, వైసీపీ మధ్య ఆధిపత్య పోరుతో వాయిదా పడింది.



ఇద్దరు చిన్నారులను.. మింగేసిన జల్లేరు

బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయంలో ప్రమాదవశాత్తూ నీట మునిగి ఆదివారం ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. తాడేపల్లిగూడెం నుంచి సెలవులకు జంగారెడ్డిగూడెంలోని అమ్మమ్మ ఇంటికి వచ్చారు. జలాశయానికి చూడడానికి వెళ్లి అశువులు బాశారు.

రూ.4900 కోట్ల సహకార రుణం

- డీసీసీబీ రుణ లక్ష్యం ఖరారు
- 5.9 లక్షల మంది పైబడి రైతులకు రుణం
- డిపాజిట్ల లక్ష్యం రూ.100 కోట్ల పైబడే
- మొండి బకాయిలపై దృష్టి

5

పట్టణాలకు పైప్‌లైన్



గ్రామాలు, పట్టణాల మురుగుతో పాటు ఆక్వా చెరువుల నుంచి వ్యర్థ నీరు పంట కాలవల్లోనే కలిపేస్తున్నారు. ఫలితంగా తాగునీటి సమస్య తలెత్తింది. తాగునీటిని వాటర్ ప్లాంట్‌ల నుంచి కొనుగోలు చేసుకుంటున్నారు. ప్రజలు ఏటా తాగునీటి కోసం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ఈ సమస్యను అధిగమించడానికి కూటమి ప్రభుత్వం పైప్‌లైన్ ప్రాజెక్ట్‌లకు సన్నాహాలు చేసింది. వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ద్వారా విజ్జేశ్వరం వద్ద శుద్ధి చేసిన జలాలను పల్లెలకు పైప్‌లైన్‌ల ద్వారా సరఫరా చేయనున్నారు. ఆ దిశగా భూసేకరణ, సర్వేలో సిబ్బంది నిమగ్నమయ్యారు. పట్టణాలకు పైప్‌లైన్‌ల ద్వారా గోదావరి జలాలలను మళ్లించే ప్రాజెక్ట్‌కు తాజాగా శ్రీకారం చుట్టారు.

వాటర్ గ్రిడ్ ప్రాజెక్ట్ ద్వారా గోదావరి నీరు

- విజ్జేశ్వరం నుంచి నేరుగా శుద్ధిప్లాంట్‌లకు మళ్లింపు
- నిధులు కేటాయించిన ప్రభుత్వం
- సిద్ధమవుతున్న డీపీఆర్

(భీమవరం-ఆంధ్రజ్యోతి)

ప్రజలకు రక్షిత నీటి అందించడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గోదావరి జలాలను పట్టణాల్లో నీటి శుద్ధి ప్లాంట్‌లకు మళ్లించనున్నారు. పంపుల చెరువుల్లో భర్తీ చేస్తారు. అక్కడ శుద్ధిచేసి పట్టణ ప్రజలకు నీటిని సరఫరా చేస్తారు. గోదావరి జలాలను మళ్లించే పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను పట్టణాలకు అమలు చేస్తున్నారు. ఎప్పటిలాగే మునిసిపాలిటీలు నీటిని శుద్ధిచేసి ప్రజలకు సరఫరా చేయనున్నాయి.

ప్రయోజనమిదే..

వేసవిలో పట్టణాల్లో మంచినీటి అవసరాలకు శుద్ధిచేసిన జలాలు సరిపోవడం లేదు. నీటి సరఫరా సమయంలో విద్యుత్ కోత అమలు చేస్తున్నారు. వేసవిలో ఒంటిపూట సరఫరా చేయాల్సి వస్తోంది. ఈ సమస్యలను అధిగమించ డానికి పైప్‌లైన్ ప్రాజెక్ట్ ఉపయోగప డనుంది. వేసవిలో గోదావరి జలాలను విజ్జేశ్వరం నుంచి మళ్లించి మున్సిపాలి టీల్లో శుద్ధి చేస్తారు. కాలువ నీటితో ఇక ఇబ్బంది ఉండదు. పైప్‌లైన్‌ల ద్వారా నేరు గా పట్టణాల్లోని పంపుల చెరువుల్లోకి నీటిని మళ్లి స్తారు. దీనివల్ల కాలుష్యం లేని జలాలు సరఫరా చేసే అవకాశం ఉంటుంది. జిల్లాలోని భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం మున్సిపాలిటీలతో పాటు, ఆకివీడు నగర పంచాయతీకి ప్రభుత్వం నిధులు కేటాయించింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 80శాతం నిధులు భరించనున్నాయి. మునిసి పాలిటీలు మిగిలిన 20శాతం చెల్లించాల్సి ఉంటుంది. జిల్లా ప్రజారోగ్య శాఖ సమగ్ర ప్రాజెక్ట్ నివేదిక (డీపీఆర్) సిద్ధం చేస్తోంది.

నిధులు రూ. కోట్లలో	
భీమవరం	167
పాలకొల్లు	119
తణుకు	108.5
నరసాపురం	125
ఆకివీడు	75

గత ప్రాజెక్ట్ రద్దు

గత తెలుగుదేశం హయాంలో రూ. 225 కోట్లతో పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను ఖరారు చేశారు. అప్పట్లో నిడదవోలు, తణుకు, పాలకొల్లు పట్టణాలకు పైప్‌లైన్ వేయాలి. తర్వాత వైసీపీ పాలనలో ప్రాజెక్ట్ పడకేసింది. కూటమి ప్రభుత్వం కొత్త ప్రాజెక్ట్‌ను సిద్ధం చేసింది. తూర్పు గోదావరిలో నిడదవోలు, జిల్లాలోని తణుకు, పాలకొల్లు, నరసాపురం, భీమవరం, ఆకివీడు పట్టణాలకు పైప్‌లైన్ ప్రాజెక్ట్‌ను విస్తరించారు. తాడేపల్లిగూడెంలో రెండో సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ నిర్మిస్తున్నారు. ఇక్కడికి పైప్‌లైన్ అవసరం లేదని ప్రభుత్వం గుర్తించింది. భవిష్యత్‌లో అవసరమైతే తాడేపల్లిగూడెం మున్సిపాలిటీకి పైప్‌లైన్ వేసుకునేలా ప్రణాళిక సిద్ధం చేశారు.

ఉపాధి పనులకు డబ్బులివ్వండి

ఏళ్ల తరబడి కాంట్రాక్టర్ల ఎదురుచూపులు

- టీడీపీ ప్రభుత్వ హయాంలో పనులు
- సీసీ రోడ్లు, కల్వర్టుల నిర్మాణాలు
- చెల్లింపులు నిలిపివేసిన జగన్ సర్కార్
- అప్పుల్లో కూరుకుపోయిన కాంట్రాక్టర్లు

తాడేపల్లిగూడెం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ ప్రభుత్వ పాలనలో 2014-19 మధ్య చేపట్టిన ఉపాధి పనులకు బిల్లు చెల్లించలేదు. చేపట్టిన పనులకు సొమ్ముకోసం కాంట్రాక్టర్లు ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్నారు. అప్పట్లో చేపట్టిన సీసీ రోడ్లు, కల్వర్టులు, గోకులం షెడ్ పనులకు సొమ్ము అందక కాంట్రాక్టర్లు అప్పుల ఊబిలో కూరుకుపోయారు. తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ సర్కార్ నిధులు విడుదల చేయకపోగా చేసిన పనులపై వైసీపీ నాయకులు తీవ్ర విమర్శలు చేశారు. తాజాగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెండింగ్ పనులకు సంబంధించిన నిధులు విడుదల చేస్తామని ప్రకటించడంతో కాంట్రాక్టర్లలో ఆశలు చిగురించాయి. జిల్లాలో గత ప్రభుత్వంలో చేసిన ఉపాధి పనులకు సంబందించి రూ.298 కోట్లు కాంట్రాక్టర్లకు చెల్లించాల్సి ఉంది. జగన్ సర్కారుపై కాంట్రాక్టర్లు కోర్టును ఆశ్రయించగా రూ.34 లక్షలు దఫదఫాలుగా చెల్లించారు. ఇంకా రూ.2.64కోట్లు చెల్లించాల్సి ఉంది. ఈ నిధుల కోసం కాంట్రాక్టర్లు ఎదురుచూస్తున్నారు.



తాడేపల్లిగూడెం మండలంలో నిర్మించిన సీసీ రోడ్డు

అధికంగా కల్వర్టులే..

2014-19 సంవత్సరాల మధ్య ఉపాధి పనుల్లో వంతెనల పనులకు ఎక్కువ బకాయి చెల్లించాల్సి ఉంది. జిల్లాలో 240 పనులకు సంబందించి రూ. 1.20 కోట్లు చెల్లించాల్సి ఉండగా తరువాత స్థానంలో గోకులం షెడ్‌లు 650 పనులకు రూ.80 లక్షలు పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని పనులకు సొమ్ము చెల్లించాల్సి ఉంది. వీటిలో అధికంగా తాడేపల్లిగూడెం మండలానికే ఎక్కువగా పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లా మొత్తం రూ.2.68 కోట్లు కాగా ఒక్క తాడేపల్లిగూడెం

మిగతా 4వ పేజీలో



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న పాఠశాల ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడి భేష్

- తల్లిదండ్రులూ పిల్లలను పంపించండి
- గ్రామాల్లో ఉపాధ్యాయుల ఇంటింటా ప్రచారం
- విద్యార్థుల నమోదు పెంచడానికి చర్యలు
- ప్రభుత్వ కొత్త విధానాలపై అవగాహన

భీమవరం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): 'ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు భేష్. మీ పిల్లలను పంపిస్తే ప్రతిభ కలిగిన విద్యార్థులుగా తీర్చిదిద్దుతాం.' ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంటింటి ప్రచారంలో తల్లిదండ్రులకు ఇలా అవగాహన కల్పిస్తున్నారు. ఒకపక్క ప్రభుత్వం తీసుకుంటున్న కొత్త విద్యా విధానం, ఉచిత సౌకర్యాలు వివరిస్తున్నారు. ఉపాధ్యాయుల క్యాంపెయినింగ్‌తో విద్యార్థుల నమోదు గణనీయంగా పెరుగుతుందన్న అంచనాలో విద్యాశాఖ ఉంది. 2024-25 విద్యా సంవత్సరంలో పెరిగిన ఉత్తీర్ణత శాతాన్ని ఉపాధ్యాయులు వివరిస్తున్నారు. ఐదేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో తగ్గిపోతున్న విద్యార్థుల సంఖ్యను పెంచే ప్రయత్నం చేస్తున్నారు.

పెరిగిన ఉత్తీర్ణతా శాతం

గడిచిన మూడేళ్లలో పదో తరగతి ఫలితాల్లో ప్రభుత్వ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం బాగా పడిపోయింది. 2021-22లో 45 శాతం లోపు, 2022-23లో 50 శాతంలోపు ఉత్తీర్ణత నమోదైంది. 2023-2లో కూడా 50 శాతం ఉత్తీర్ణతతోనే సరిపెట్టుకోవలసి వచ్చింది. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులు ఆలోచన మారింది. నాలుగేళ్ల క్రితం జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలో 1.38 లక్షల మంది విద్యార్థులు ఉంటే 2023-24 సంవత్సరానికి 99 వేలకు పడిపోయింది. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక విద్యావిధానాల్లో మార్పులు తీసుకొచ్చే ప్రయత్నాలు చేసింది. పదో తరగతి బోధనలో పట్టుబిగించడంతో 2024-25 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు 72.9 శాతం ఉత్తీర్ణత సాధించారు. బాలురు 5,991 మందికి 3,910 మంది ఉత్తీర్ణత సాధించగా, బాలికలు 6,619 మందికి 5,180 మంది ఉత్తీర్ణత సాధించారు. పదో తరగతిలో 592 మార్కులు సాధించిన ఘనత ప్రభుత్వ పాఠశాల విద్యార్థికి దక్కింది. పది మంది విద్యార్థులైతే 586 మార్కులు పైబడి జిల్లాలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సాధించారు.

విద్యా సామగ్రి అందించడంలోనూ స్పీడ్

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు పుస్తకాలు, కిట్లు సమయానికి అందించే ఏర్పాట్లు చేసింది. పది రోజుల క్రితమే పాఠ్యపుస్తకాలను మండలాల వారీగా అందించారు. 70 శాతం పాఠ్యపుస్తకాలు చేరాయి. మరో పది రోజుల్లో విద్యా సామగ్రి రానుంది. జిల్లాలో 93,450 విద్యార్థులకు బ్యాగులు, షూ, యూనిఫామ్ అందించే ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. 6,51,038 నోట్ పుస్తకాలు, 12,58,847 పాఠ్య పుస్తకాలు విద్యార్థులకు అందనున్నాయి. మొదటి తరగతి విద్యార్థులకు పుస్తకాల భారం తగ్గించడంతోపాటు మంచి బోధన అందించేలా పాఠ్య పుస్తకాలను రూపుదిద్దారు. మొదటి తరగతికి 2 టెక్స్ట్ బుక్స్ 2 నోట్ బుక్స్ రెండో తరగతికి 2 టెక్స్ట్ బుక్స్, 2 నోట్ బుక్స్ మూడో తరగతి విద్యార్థులకు 4 టెక్స్ట్ బుక్స్ 4నోట్ బుక్స్ అందించనున్నారు. రెండు సెమిస్టర్ల వారీగా అందించనుండడంతో పుస్తకాల మోత ఉండదు. 4, 5 తరగతులకు కూడా రెండు సెమిస్టర్లుగా పుస్తకాలు అందిస్తారు.

ఆరంభంలోనే విద్యా సామగ్రి



విద్యార్థులకు విద్యా సామగ్రి విద్యా సంవత్సరం ప్రారంభంలోనే అందించే ఏర్పాట్లు జరుగుతున్నాయి. మే 25 నాటికి స్కూల్ బ్యాగులు, పుస్తకాలు అందుబాటులోకి వచ్చేస్తాయి. మండలాల వారీగా పాఠ్యపుస్తకాలు చేరాయి. విద్యా సామగ్రి కూడా అందిస్తాం.

- వై.చంద్రశేఖర్, కమ్యూనిటీ మొబలైజింగ్ ఆఫీసర్



తాడేపల్లిగూడెంలో పరీక్ష కేంద్రానికి వెళుతున్న విద్యార్థులు

జేఈఈ అడ్వాన్స్‌డ్

ఉమ్మడి పశ్చిమ జిల్లా ఐదు కేంద్రాల్లో ఆదివారం జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. తాడేపల్లిగూడెం పట్టణం శశి ఇంజనీరింగ్ కళాశాల, పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో పరీక్షలు జరిగాయి. వట్లూరులోని పరీక్ష కేంద్రం వద్ద వసతుల లేమిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు దిగారు.

మినీ మహానాడు

తెలుగుదేశం పార్టీ మహానాడు సన్నాహాల్లో భాగంగా నియోజకవర్గ మహానాడు నిర్వహిస్తున్నారు. జిల్లాలో ఆదివారం భీమవరం నియోజకవర్గ మహానాడు నిర్వహించారు. ఈ నెల 24న తణుకులో జరిగే మినీ మహానాడు విజయవంతం చేయాలని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు.



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న తోట సీతారామలక్ష్మి, నేతలు

ఉచిత వైద్య సేవలు

తణుకు, మే 18(ఆంధ్రజ్యోతి): సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్తంగా ఆదివారం సంచార శకటంతో వెళ్లి ఉచిత వైద్య సేవలు అందించారు. నేత్ర వైద్యుడు డాక్టర్ హుస్సేన్ అహ్మద్ తణుకు, చివటం, పైడిపర్రు ప్రాంతాల్లో పర్యటించి ఆరుగురికి వైద్య సేవలందించారు. సంఘ సభ్యుడు కె.రామ్మోహనరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు అందజేశారు. సంఘ అధ్యక్షుడు అల్లూరి కరుణాకర్ చౌదరి, సభ్యులు పార్వతి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

భీమవరం

భీమవరం, ఉండి, నరసాపురం, పాలకొల్లు, ఆచంట, తణుకు, తాడేపల్లిగూడెం

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

తణుకు, మే 18(ఆంధ్రజ్యోతి): జూలై 5న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని నాల్గో అదనపు జిల్లా న్యాయమూర్తి డి.సత్యవతి కోరారు. పోలీసు అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న పెండింగ్ కేసుల్లో రాజీ చేయదగిన వాటిని కౌన్సెలింగ్ ఇచ్చి రాజీ చేయాలని చెప్పారు. న్యాయాధికారులు కె.కృష్ణవేణి, తాడి ఆంజనేయులు, బార్ అధ్యక్షుడు కామేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు గూడెం, గణపవరంలో మినీ మహానాడు

తాడేపల్లిగూడెం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం పట్టణంలోని మాగంటి కల్యాణ మండపంలో సోమవారం తెలుగుదేశం మినీ మహానాడు నిర్వహిస్తున్నట్లు టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, రాష్ట్ర భవన మరియు ఇతర కార్మికుల సంక్షేమ మండలి చైర్మన్ వలవల బాబ్జి తెలిపారు. ఎమ్మెల్యేలు బడేటి చంటి, మద్దిపాటి వెంకట్రాజు, ఆప్కాబ్ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ గన్ని వీరాంజనేయులు, ఎస్సీ కమిషన్ చైర్మన్ జవహర్ తదితరులు హాజరవుతారన్నారు. పార్టీ శ్రేణులంతా తప్పనిసరిగా పాల్గొవాలని కోరారు.

గణపవరం: ఉంగుటూరు నియోజకవర్గ స్థాయిలో టీడీపీ మినీ మహానాడు సోమవారం సాయంత్రం 3 గంటలకు గణపవరంలో జరుగుతుందని రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, మండల టీడీపీ అధ్యక్షుడు ఇందుకూరి రామకృష్ణంరాజు, ఉంగుటూరు నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు అద్దేపల్లి వాసురాజు తెలిపారు. గణపవరం కేవీపీ కన్వెన్షన్ హాలులో జరిగే మినీ మహానాడుకు ఏలూరుజిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, జిల్లా నాయకులు పాల్గొంటారని, పార్టీ శ్రేణులంతా తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రాజ్యాంగ పరిరక్షణ అందరి బాధ్యత: మోషేన్



భీమవరం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు అన్నారు. శనివారం రాత్రి గునుపూడిలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో అభ్యుదయ ఆర్ట్స్ అకాడమీ అంబేడ్కర్ జీవిత చరిత్ర నాటక ప్రదర్శన నిర్వహించారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి మోషేన్ రాజు, పీడీఎఫ్ ఎమ్మెల్సీ గోపి మూర్తి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రూ. 50 వేలు నరసాపురం ఆర్డీవో దాసిరాజు కళాకారుల ప్రోత్సాహక బహుమతిగా అందించారు. అభ్యుదయ ఆర్ట్స్ డైరెక్టరు జగ్గరాజు, ఐఏఎస్ ఫారం అధ్యక్షులు సిద్ధోధి రావు, అంబేడ్కర్ బుద్దిస్ట్, చైతన్యభారతి కళాపరిషత్ అధ్యక్షులు రాయప్రోలు భగవాన్, బలరాం, జేఎన్‌వీ గోపాలన్, కేవీపీఎస్ క్రాంతిబాబు తదితరులు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో భారీ వర్షం



తాడేపల్లిగూడెం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం, పెంటపాడు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం వర్షం దంచికొట్టింది. సుమారు గంటన్నర పాటు ఎడతెరిపి లేకుండా కురవడంతో రోడ్లు, డ్రెయిన్లు ఏకమయ్యాయి. తాడేపల్లిగూడెం మండలంలోని కొండ్రుప్రోలులో జాతరకు హాజరైన వారు వర్షం కారణంగా ఇబ్బంది పడ్డారు. తణుకు పట్టణంలో ఓ మోస్తరు వర్షం పడగా అత్తిలి, ఇరగవరం, భీమవరం, గణపవరం, ఆకివీడు ప్రాంతాల్లో జల్లులు పడ్డాయి.

చురుకుగా పంట కాలువ ప్రక్షాళన పనులు



ఉండి, మే 18(ఆంధ్రజ్యోతి): ఉండి పంట కాలువలో పూడిక, మట్టి తొలగింపు పనులను చురుకుగా చేపడుతున్నట్లు టీడీపీ చెరుకువాడ గ్రామ అధ్యక్షుడు యిర్రింకి సత్యనారాయణ(బుజ్జి)అన్నారు. ఆదివారం కలిసిపూడి, చెరుకువాడ వద్ద కాలువ ప్రక్షాళన, అభివృద్ధి పనులను కూటమి నాయకులు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా బుజ్జి, ఉంగరాల నాగేశ్వరరావు, జనసేన నాయకుడు కుచ్చు శివకృష్ణ, బొల్లం వాసు మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్, ఉండి ఎమ్మెల్యే కనుమూరు రఘురామకృష్ణరాజు ఆదేశాలతో ప్రక్షాళన పనులు జరుగుతున్నాయన్నారు. ఉండి పంట కాలువల్లోకి పలు చోట్ల పెట్టిన మరుడుదొడ్ల, డ్రైయిన్ల గొట్టాలను గుర్తించి తక్షణమే తొలగించడం జరుగుతుందని, ప్రజలంతా సహకరించాలని కోరారు. ఉండి నీటి సంఘం అధ్యక్షుడు మంతెన సాయిలచ్చిరాజు పనులను పర్యవేక్షించారు.

జనసేన సభ్యత్వ కిట్ల పంపిణీ



పెంటపాడు, మే 18 (ఆంధ్రజ్యోతి): కార్యకర్తలు సమర్థవంతంగా ఉంటేనే పార్టీ పరుగులు తీస్తుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఉభయ గోదావరి జిల్లాల కో-ఆర్డినేటర్ కసిరెడ్డి మధులత అధ్యక్షతన గ్రామాల వారీగా నాయకులు, కార్యకర్తలకు జనసేన సభ్యత్వ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బొలిశెట్టి మాట్లాడుతూ పార్టీ శ్రేణుల కష్టసుఖాల్లో జనసేన వెన్నంటి ఉంటుందన్నారు. వర్తనపల్లి కాశి, పుల్లా బాబి, అడపా ప్రసాద్, నీలపాల దినేష్, పాలూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

500 మందికి ఉచిత వైద్య పరీక్షలు



మొగల్తూరు, మే 18(ఆంధ్రజ్యోతి): మొగల్తూరులోని సీతారామ మెడికల్ స్టోర్స్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో గుండె, ఊపిరితిత్తులు, షుగరు వ్యాధి నిపుణుడు సంకా పాపారావు, చిన్నపిల్లల వ్యాధుల నిపుణుడు కోడూరి సాయి మనోజ్, స్త్రీల వ్యాధి నిపుణులు టంగుటూరి లావణ్య, ఎముకలు, కీళ్ళ వ్యాధి నిపుణులు కృష్ణ ఫణీంద్ర, చర్మ వ్యాధి నిపుణులు ఉమా సింధు, గుండె వ్యాధి నిపుణుడు యుధిష్టర్ సిరిపురపు పాల్గొని సమారు 500 మంది రోగులను పరీక్షించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. మెడికల్ స్టోర్స్ యజమాని సంకా సోమరాజు శిబిరం ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నూతన కార్యవర్గం ఏకగ్రీవం

ఆకివీడు, మే 18(ఆంధ్రజ్యోతి): ఆకివీడు తాలూకా యూనిట్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారి వై.మోహన్‌రావు, సహాయాధికారి జక్కురయ్య సమక్షంలో జరిగిన ఎన్నికల్లో అధ్యక్షులుగా జి.చిట్టిబాబు, అసోసియేట్ అధ్యక్షురాలిగా ప్రియాంక, ఉపాధ్యక్షులుగా షేక్ అహ్మద్ ఫరూఖ్, పాల్సన్, అశోక్, జయరాజు, మణిదీప్, కార్యదర్శిగా ఎన్.ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా సతీష్, బషీరాబాను, మోహన్, అనిల్, సుధాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గంగాధరరావు, కోశాధికారిగా సుందర్‌పాల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జూన్ 5న జరిగే రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జయప్రదం చేయాలని పోస్టర్‌ను ఆవిష్కరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఉమర్ అలీషా తదితరులు పాల్గొన్నారు.





నరసాపురం, పాలకోడేరులో జాతీయ జెండాతో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

సిందూర్ విజయోత్సాహం

»సైనికులకు అండగా నిలుద్దాం »తిరంగా యాత్రలో వక్తల పిలుపు »జాతీయ జెండాలతో ర్యాలీలు

నరసాపురం, మే 18 (ఆంధ్రజ్యోతి): దేశం కోసం పోరాటాలు చేస్తున్న సైనికులకు ప్రతి భారతీయుడు అండగా నిలవాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ పిలుపు నిచ్చారు. ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన నేపథ్యంలో పట్టణంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. కూటమి శ్రేణులు, ప్రజలు, కార్మికులు, ముస్లిం మైనార్టీలు ర్యాలీలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భారత్‌మాతాకు జై, వందేమాతరం అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. టీడీపీ ఇన్‌చార్జి పొత్తూరి రామరాజు మాట్లాడుతూ దేశ రక్షణ, ఉగ్రవాదులపై సైనికుల పోరాటాలకు ప్రజలంతా అండగా నిలవాలన్నారు. అనంతరం యుద్ధంలో అమరులైన వీర జవాన్లకు నివాళుల్పరించారు. మత్స్యకార సంఘాల చైర్మన్ కొల్లు పెద్దిరాజు, గునిశెట్టి శ్రీను, వి. శ్రీను, కొప్పాడ రవి, జక్కం శ్రీమన్నారాయణ, ఆకన చంద్రశేఖర్, వలవల నాని, కోటిపల్లి వెంకటేశ్వరరావు, గుబ్బల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

పులకించిన తణుకు..

తణుకు: ఆపరేషన్ సిందూర్ విజయాన్ని పురస్కరించుకుని ఆదివారం ఉదయం తణుకులో ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ ఆధ్వర్యంలో 400 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ జరిగింది. జై భారత్, జై జవాన్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలతో పట్టణం మార్మోగింది. ఈ సందర్భంగా ఆరిమిల్లి మాట్లాడుతూ ఉగ్రమూకలను మట్టి కరిపించే విధంగా చేపట్టిన ఆపరేషన్ సిందూర్ విజయవంతమైందన్నారు. పెద్ద ఎత్తున విద్యార్థులు, వైద్యులు, యువత పాల్గొన్నారు. పదవీ విరమణ చేసిన జవాన్లను ఎమ్మెల్యే ఘనంగా సత్కరించారు. కూటమి శ్రేణులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాలకోడేరు: కూటమి ప్రభుత్వ ఆదేశానుసారం ఆపరేషన్ సిందూర్ విజయవంతమైన సందర్భంగా పాలకోడేరు మండల కూటమి నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం పాలకోడేరులో తిరంగా యాత్ర నిర్వహించారు. దేశం కోసం వీరమరణం పొందిన సైనికుల త్యాగాన్ని మరువకూడదన్నారు. మున్ముందు దేశ రక్షణ కొరకు ప్రతి పౌరుడు నడుం బిగించాలన్నారు. కూటమి నాయకులు మోగల్లు బాబు, ఉండి అసెంబ్లీ బీజేపీ కన్వీనర్ కోరా రామ్మూర్తి, గాదిరాజు శ్రీనివాస రాజు, క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బీఎస్‌కే వర్మ, జనసేన మండల అధ్యక్షులు నానాజీ, అల్లూరి సాయిదుర్గరాజు, ఇంజేటి వెంకటేశ్వర్లు, లక్ష్మీపార్వతి, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

హామీలు అమలు చేసిన సీఎం

టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కోళ్ల నాగేశ్వరరావు

ఘనంగా టీడీపీ మినీ మహానాడు

భీమవరం అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): తణుకులో ఈ నెల 24న జరిగే జిల్లా మినీ మహానాడును జయప్రదం చేయాలని రాష్ట్ర పోలిట్ బ్యూరో సభ్యురాలు, భీమవరం నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి పిలుపునిచ్చారు. భీమవరం నియోజకవర్గ మినీ మహానాడు పట్టణంలోని ఆనందా ఫంక్షన్ హాలులో ఆదివారం ఘనంగా జరిగింది. ముందుగా సీతారామలక్ష్మి పార్టీ జెండాను ఆవిష్కరించి, జ్యోతి ప్రజ్వలన చేసి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహానాడు సమావేశాన్ని ప్రారంభించారు. ముందుగా పహల్గాం ఉగ్రదాడి మృతులకు, గత రెండేళ్లలో మరణించిన టీడీపీ నాయకులకు సంతాప సూచకంగా మౌనం పాటించారు. సీతారామలక్ష్మి మాట్లాడుతూ 27, 28, 29 తేదీల్లో కడప జిల్లాలో జరిగే రాష్ట్ర మహానాడుకు నియోజకవర్గ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలన్నారు. రాష్ట్ర కార్యదర్శి కోళ్ళ నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాల అమలు ప్రారంభమైందన్నారు. వీరవాసరం మండల అధ్యక్షుడు కొల్లేపర శ్రీనివాస్ మాట్లాడుతూ తమ మండలంలోని నూతన కమిటీల ఏర్పాటు చాలా వరకు అన్ని గ్రామాలలో పూర్తయిందని రాయకుదురు గ్రామ కమిటీ ఇంకా కాలేదన్నారు. భీమవరం రూరల్ మండల నాయకులు



మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి తోట సీతారామలక్ష్మి

కౌరు పృథ్వీశంకర్ మట్లాడుతూ తమ మండల పరిధిలో గ్రామ కమిటీల నియామకం అంతా బాగానే జరిగిందని చెప్పగా రాయలం గ్రామ సీనియర్ నాయకుడు కోళ్ళ అబ్బులు ఎవరిని సంప్రదించి కమిటీలు ఏర్పాటు చేశారని ప్రశ్నించారు. దీంతో కొద్దిసేపు ఘర్షణ వాతావరణం చోటు చేసుకోవడంతో సీతారామలక్ష్మి, కోళ్ళ నాగేశ్వరరావు కలుగ చేసుకుని వారికి సర్ది చెప్పారు. యనమదుర్రు డ్రెయిన్‌పై నిర్మించిన 3 వంతెనలకు వెంటనే అప్రోచ్‌లు నిర్మించాలని, గ్రామాల్లో మంచినీటి సమస్య పరిష్కరించాలని మండల నాయకులు, పట్టణంలోని బైపాస్ రోడ్డులో రైల్వే గేటుకు పై ఓవర్ నిర్మించాలని, పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని పట్టణ అధ్యక్షుడు ఇందుకూరి సుబ్రహ్మణ్యం రాజు కోరారు.

నియోజకవర్గ నాయకులు మెరగాని నారాయణమ్మ, వేండ్ర శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ ఇందుకూరి సుబ్రహ్మణ్యంరాజు, గూడూరి సుబ్బారావు, ఉప్పులూరి చంద్రశేఖర్, పామర్తి వెంకట్రామయ్య, నాగిడి తాతాజీ, గంటా త్రిమూర్తులు, మదాసు కనకదుర్గ తదితర నాయకులు పాల్గొన్నారు.



మందులు అందజేస్తున్న దృశ్యం

రోటరీ క్లబ్ మందుల వితరణ

పాలకొల్లు, మే 18(ఆంధ్రజ్యోతి): రోటరీ క్లబ్ ఆఫ్ పాలకొల్లు ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీ గాయత్రి మెడికల్ షాపు, చొక్కాకులు శ్రీనివాస్ ఆర్థిక సాయంతో గుండె వ్యాధితో బాధపడుతున్న జగన్నాథపురానికి చెందిన మహిళ గుబ్బల రాజేశ్వరికి రూ. 5 వేలు విలువ చేసే మందులు పంపిణీ చేశారు. డిస్ట్రిక్ట్ మెంబర్ షిప్ చైర్ ఏవీ రంగారావు, అసిస్టెంట్ గవర్నర్ ముత్యాల శ్రీనివాసరావు, రోటరీ పాలకొల్లు ప్రెసిడెంట్ సతీష్, సెక్రటరీ జవ్వాజి కల్యాణ్, ట్రెజరర్ పోతాబత్తులు సత్యనారాయణ, ముద్దాల వాసు, మైగాపుల రాంబాబు, ముచ్చర్ల సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

హెల్మెట్‌తో ప్రాణ రక్షణ

కాళ్ళ మే 18 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని కాళ్ళ ఎస్ఐ ఎన్.శ్రీనివాసరావు తెలిపారు. కాళ్ళకూరు గ్రామంలో ఆదివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించి వాహనచోదకులకు హెల్మెట్ వాడకంపై అవగాహన కల్పించారు. అనుకోని పరిస్థితుల్లో జరిగే ప్రమాదాల్లో హెల్మెట్ ఉండటం వల్ల ప్రాణాపాయ స్థితి నుంచి బయటపడిన వారు చాలామంది ఉన్నారని, హెల్మెట్ ధరించాలని సూచించారు. పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



వసుధా ఫౌండేషన్ వితరణ

పాలకొల్లు అర్బన్, మే18(ఆంధ్రజ్యోతి) : స్థానిక ఎల్ఆర్‌పేటకు చెందిన పేరిచర్ల మణి కంఠ అనే యువకుడు రోడ్డు ప్రమాదంలో కాలు విరిగి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలిసి వసుధా ఫౌండేషన్ చైర్మన్ మంతెన వెంకట రామరాజు స్పందించి రూ. 10వేలు చెక్కును పంపారు. రూ10వేల చెక్కును ఫౌండేషన్ ఏరియా కన్వీనర్ పెన్మెత్స బుద్ధరాజు ఆదివారం అందజేసారు. ఈకార్యక్రమంలో భూపతిరాజు అనంత లక్ష్మీ, మణికంఠ తల్లి ఉన్నారు.

యోగాతో ఒత్తిడి దూరం

ఆకివీడు, మే 18 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఒత్తిడిని జయించవచ్చునని యోగాసనాచార్య కందుల సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పోలీసులకు యోగా, ధ్యానంపై శిక్షణ ఇచ్చి అనంతరం బీపీ, సుగర్ పరీక్షలు నిర్వహించి మాట్లాడారు. జూన్ 21న యోగా డేను ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబునాయుడు వైజాగ్‌లో ఘనంగా నిర్వహిస్తున్నారని, యోగాను అందరికి అందించాలనే పిలుపుతో శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. పతంజలి యోగారోగ్య కేంద్రంలో 42 ఏళ్ల నుంచి ఉచితంగా ప్రతిరోజూ ఉదయం 5 నుంచి 6 గంటలు వరకూ యోగాపై శిక్షణ ఇస్తున్నామని, అందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.



సమావేశంలో టీచర్స్ ఫోరం ప్రతినిధులు

2003 డీఎస్సీ టీచర్స్‌ను ఓపీఎస్ పరిధిలోకి తేవాలి

తాడేపల్లిగూడెం రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని మండలాల 2003 డీఎస్సీ ఉపాధ్యాయులను ఓపీఎస్ పరిధిలోకి తేవాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. తాడేపల్లిగూడెం జడ్పీ ఉన్నత పాఠశాల వద్ద ఆదివారం 2003 టీచర్స్ ఫోరం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2003 డీఎస్సీలో దరఖాస్తు చేసుకున్న వారికి 2005లో ఉద్యోగం పొందడం వల్ల సీపీఎస్ విధానంలోకి వచ్చారని, చాలా రాష్ట్రాల్లో ఓపీఎస్ అమలు చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల ఫోరం రాష్ట్ర కన్వీనర్ కట్టా శ్రీనివాసరావు, నాయకులు జగదీశ్, చంద్ర ప్రసాద్, చీపుర్ల సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనారాయణుడికి చందనోత్సవం



పాలకొల్లు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం చందనోత్సవం నిర్వహించారు. శనివారం రాత్రి స్వామి వారి తిరు కల్యాణం జరిగింది. ఆదివారం స్వామివారిని తిరునారాయణ పెరుమాళ్‌గా అలంకరించి రథోత్సవం నిర్వహించారు. ఈవో సత్యనారాయణ శంకర్ ఏర్పా ట్లను పర్యవేక్షించారు.

ఘనంగా జాతరలు..

పద్దాల వెంకమ్మ..

నరసాపురం రూరల్, మే 18(ఆన్‌లైన్): మండలంలోని కొప్పర్రులో పద్దాల వెంకమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. అమ్మవారికి గ్రామస్థులు నైవేద్యాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవనాయుడు, సినీ నటుడు బెల్లకొండ ప్రవీణ్, కమిటీ సభ్యులు పొలిశెట్టి శ్రీనివాస్, మధు, వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

మాచేనమ్మ..

ఆచంట: పెదమల్లం మాచేనమ్మ పల్లాలమ్మ అమ్మవార్ల జాతరలు వేడుకగా జరుగుతున్నాయి. శనివారం రాత్రి పెద్ద వీధి ఆధ్వర్యంలో అమ్మవారి జాతర వేడుకగా జరిగింది. జాతరలో గరగనృత్యాలు , తీన్మార్ డప్పులు సన్నాయి మేళాలు బుట్టబొమ్మలు డ్యాన్సులు పలువురిని ఆకట్టుకున్నాయి.

గోగులమ్మ..

మొగల్తూరు: లాకు పల్లవపాలెంలో గల గోగులమ్మ జాతర ఆదివారం ఘనంగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే బండారు మాధవ నాయుడు, టీడీపీ సీనియర్ నాయకుడు బస్వాని ఏడుకొండలు అమ్మవారిని దర్శిం చుకున్నారు.

అంకాలమ్మ..

తాడేపల్లిగూడెం రూరల్: 8 ఏళ్ల తర్వాత జరిగిన కొండ్రుప్రోలు అంకాలమ్మ జాతర ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జి అమ్మవారికి పూజలు చేశారు.



పతకాలు అందుకున్న కిరణ్మయి, సుశ్రీ

సంపూర్ణ భగవద్గీత పరీక్షల్లో ప్రతిభ

పాలకొల్లు అర్బన్, మే 18(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఉద్దగిరి కిరణ్మయి, తోలేటి నాగ వెంకట కృష్ణ సుశ్రీలు సంపూర్ణ భగవద్గీత పరీక్షల్లో ఉత్తమ శ్రేణిలో ఉత్తీర్ణులై బంగారు పతకాలు సాధించారు. శనివారం మైసూర్ దత్తపీఠంలో జరిగిన కార్యక్రమంలో గణపతి సచ్చిదానంద స్వామీజీ చేతుల మీదుగా వీరు సర్టిఫికెట్లు, పతకాలు అందుకున్నారు. సంపూర్ణ భగవద్గీత ఆన్‌లైన్ ద్వారా శిక్షణ పొంది, ఆన్‌లైన్‌లో పరీక్షలకు హాజరై, గోల్డ్ మెడల్స్ సాధించిన వీరిని పలువురు అభినందించారు. కిరణ్మయి ప్రొఫెసర్‌గా ఉద్యోగం చేసి, ప్రస్తుతం గృహిణిగా ఉన్నారు. సుశ్రీ హైదరాబాద్‌లో ఆన్‌లైన్ కోర్సులో శిక్షణ పొందుతున్నారు.



కమిటీకి విరాళాన్ని అందజేస్తున్న దృశ్యం

ఆలయ అభివృద్ధికి విరాళం

పెనుగొండ, మే 18(ఆంధ్రజ్యోతి): పెనుగొండ మండలం వడలి గ్రామ దేవత మందాలమ్మ వారి ఆలయ అభివృద్ధికి దాతలు విరాళం అందజేశారు. ఏలూరుకు చెందిన యల్లా శ్రీరామమూర్తి, చంద్రావతి దంపతుల కుమారుడు యల్లా వెంకటేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు ఆలయ కమిటీ సభ్యులకు ఆదివారం రూ. 10,116 రూపాయలు విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు వారిని అభినందించారు.

డీఈవో కార్యాలయం ముట్టడిస్తాం

ఆకివీడు, మే 18 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్న సంస్కరణలను విరమించకుంటే ఈ నెల 21న జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం ముట్టడిస్తామని యూటీఎఫ్ మండల ప్రధాన కార్యదర్శి ఆర్వీఎస్ నారాయణ (విక్రమ్) హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ స్కూల్ అసిస్టెంట్లును మోడల్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టరుగా నియమించడాన్ని విరమించుకోవాలన్నారు. ఫౌండేషన్, అప్పర్ ప్రైమరీ, ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల ప్రమేయం లేకుండా అన్ని సబ్జెక్టులకు ఉపాధ్యాయులను నియమించాలని, అదే విధంగా ఉన్నత పాఠశాలల్లో కూడా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులను నియమించాలన్నారు. తెలుగు, ఇంగ్లీషు మాధ్యమాన్ని సమాంతరంగా అన్ని పాఠశాలల్లో కొనసాగించాలన్నారు.



మరింత తగ్గిన ఉల్లి

నిలకడగా కూరగాయల ధరలు

పెంటపాడు, మే 18(ఆంధ్రజ్యోతి): ఉల్లి ధరలు మరింత తగ్గాయి. తాడేపల్లిగూడెం మార్కెట్‌లో గత వారం 5 కేజీలు రూ. 100 లు ఉండే ఉల్లి ఈ వారం 6 కేజీలు రూ. 100 లకు చేరాయి. దీంతో వినియోగదారులకు ఊరట లభించింది. ఇక కూరగాయల ధరలు మాత్రం నిలకడగా కొనసాగాయి. ఆదివారం మార్కెట్‌లో కూరగాయల ధరలు ఇలా ఉన్నాయి. కేజీ టమాటో రూ. 20, బీర రూ. 50, దొండ రూ. 30, తెల్లవంకాయలు రూ. 50లు, నల్ల వంకా యలు రూ.40, అల్లం రూ. 60, మునగకాయలు 3 రూ. 20లు, ఆనపకాయ రూ. 15, దోస కిలో రూ. 30, అరటికాయలు 3 రూ. 20 లు, క్యాబేజి కిలో రూ. 30 లు, బీట్‌రూట్ కేజీ రూ. 40 లు, బీన్స్ కేజీ రూ. 80 లు, కాప్సికం రూ. 60లు, పచ్చి మిరపకాయలు కేజీ రూ. 40 లు పలికాయి.

ఉత్సాహంగా వేసవి శిక్షణ

తణుకు రూరల్, మే 18(ఆంధ్రజ్యోతి): వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం తణుకు రూరల్ మండలం వేల్పూరు గ్రంథాలయంలో విద్యార్థులకు కథలు చెప్పడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, ఇంగ్లీష్ వ్యాకరణం, ఇంగ్లీష్ పదాలకు తెలుగు అర్థాలు చెప్పడం, వంటి అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. చదరంగం, వైకుంఠపాళిపై వివరించారు. రీసోర్సు పర్సన్ జి. బసవయ్య, కోరా సత్యనారాయణ, ఎ. ధనరాజు, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాకరణం నేర్చుకుంటే భాషపై పట్టు

అత్తిలి, మే 18(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యాకరణం నేర్చుకోవడం ద్వారా తెలుగు సాహిత్యంలో పట్టు సాధించవచ్చని రిసోర్స్ పర్సన్ కె కోమలి అన్నారు. వేసవి శిక్షణలో భాగంగా అత్తిలి శాఖా గ్రంథాలయంలో వ్యాకరణంపై అవగాహన కల్పించారు. పుస్తక, పత్రికా పఠనం చేయించారు. వేమన పద్యాలు రిటైర్డ్ గ్రంథపాలకుడు గంధం శేషవేంద్రరావు చదివించారు. గ్రంథాలయాలధికారి డి. కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులకు డబ్బులివ్వండి

(3వ పేజీ తరువాయి)

మండలంలోనే రూ. కోటి పైగా బిల్లులు చెల్లించాల్సి ఉంది.

అప్పుల భారం



టీడీపీ హయాంలో ఐదు గ్రామాల్లో ఉపాధి హామీ మెటీరియల్ కాంపోనెంట్‌తో పనులు చేశాం. రూ.40 లక్షలకు పను లు చేయగా ఒక్క పైసా కూడా రాలేదు. అప్పు తెచ్చి పనులు చేస్తే అప్పు కట్టడానికి ఐదేళ్లుగా మరిన్ని అప్పు లు చేయాల్సి వచ్చింది. బిల్లులొస్తే అప్పు తీరుతుంది.

-రెడ్డి రాము, దండగర్ర

మా గ్రామం కోసం పనులు చేశాం



అప్పట్లో గ్రామంలో పనులు చేసేందుకు బయటవారు రాకపోతే మా గ్రామం కోసం మేమే పనులు చేశాం. ఎంతో ఖర్చుచేశాం. ఆ బిల్లులు రాకపోగా తిరగడానికే చాలా ఖర్చయింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నిర్ణయంతో మాకు ఆ బిల్లులపై ఆశలు చిగురించాయి.

-పాకనాటి సుబ్బారావు, కడియద్ద

త్వరలోనే బిల్లులు చెల్లిస్తాం

ప్రభుత్వం గతంలో పనులు చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులు చెల్లించాలనే ఆదేశాలతో బకాయిలపై మొత్తం లెక్కలు వేశాం. ఆ పెండింగ్ బిల్లులు త్వరలోనే చెల్లించేలా ఉన్నతాధికారులు ఆదేశించారు.

-కేసీహెచ్ అప్పారావు, డ్వామా పీడీ



ఏలూరులో 'భైరవం' సినిమా ట్రైలర్ లాంచ్

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : బెల్లంకొండ సాయి శ్రీనివాస్, నారా రోహిత్, మంచు మనోజ్‌లు నటించిన 'భైరవం' చిత్రం ఈనెల 30న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రచారంలో భాగంగా చిత్ర బృందం ఆదివారం సాయంత్రం ఏలూరు ఇండోర్ స్టేడియంలో ట్రైలర్‌ను లాంచ్ చేశారు. హీరోయిన్లు అతిథి శంకర్, ఆనంది పాల్గొని సందడి చేశారు.రాష్ట్ర మంత్రి కందుల దుర్గేష్, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌యాదవ్, ఎమ్మెల్యేలు చింతమనేని ప్రభాకర్, బడేటి చంటి, నిర్మాత అంబికా కృష్ణ హాజరై ట్రైలర్‌ను లాంచ్ చేశారు. రాష్ట్ర మంత్రి దుర్గేష్ మాట్లాడుతూ ట్రైలర్ అద్భుతంగా ఉందన్నారు. చలనచిత్ర పరిశ్రమకు వైభవం తీసుకురావడానికి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కృషి చేస్తున్నారన్నారు. హీరోలు మాట్లాడుతూ ముగ్గురం కలిసి నటించడం ఆనందంగా ఉందన్నారు. నటులు అజయ్, దర్శకుడు విజ య్ కనకమేడల, మ్యూజిక్ డైరెక్టర్ శ్రీచరణ్, నిర్మాత రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఆలయ అర్చకుల నుంచి వేదాశీర్వచనం పొందుతున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

శ్రీవారి సేవలో కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

ద్వారకాతిరుమల, మే 18 (ఆంధ్రజ్యోతి): ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు సందర్శించారు. కొద్దిరోజుల క్రితం అనారోగ్యానికి గురై పూర్తి స్వస్థత పొందిన అనంతరం ఆయన స్వామివారిని దర్శించుకునేందుకు వచ్చి మొక్కుబడులు తీర్చుకున్నారు. ఆల యానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చ కులు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. బంగారు వాకిలి గుండా వెళ్లి స్వామి, అమ్మ వార్లను దర్శిం చుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో ఆయనకు అర్చకులు వేదాశీర్వచనం అందజేశారు. ఆలయ ఏఈవో నటరాజారావు స్వామివారి మెమెంటో, ప్రసాదాలను అందించారు. టీడీపీ నాయకులు నేతలు ఇమ్మడి రత్నాజీ, కూరాకుల బుజ్జి, గుణ్ణం రవికుమార్, ప్రవీణ్‌కుమార్, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్స్‌కు ఫైరింగ్‌పై శిక్షణ

నరసాపురం రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్వర్ణాంధ్ర ఇంజనీరింగ్ కళాశాలలో సెవెన్ ఆంధ్రా నేవెల్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ క్యాంపు ఆదివారం ఐదో రోజుకు చేరింది. కేడెట్స్‌కు ఫైరింగ్, యోగా, డ్రిల్, రన్నింగ్ తదితర అంశాలపై గ్రూప్ లెఫ్టినెట్ కమోండర్ రోహిత్‌కుమార్ శిక్షణ ఇచ్చారు. ఫైరింగ్‌కు ఏకగ్రత చాలా ముఖ్యమన్నారు.ఇది యోగా వల్లే సాధ్యపడు తుందన్నారు. వ్యాయమంతో పాటు విధిగా యోగా చేయాలన్నారు. దీనివల్ల చదువుల్లో జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. అనంతరం అగ్ని మాపక సిబ్బంది ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మంటల్ని ఎలా అదుపు చేయాలన్న దానిపై శిక్షణ ఇచ్చారు. ఫైర్ అధికారి నాగరాజు, ఎన్‌సీసీ అధికారులు పాల్గొన్నారు.



రాష్ట్ర మల్లకంబ్ జట్టులో స్థానం సాధించిన క్రీడాకారులతో కోచ్

మల్లకంబ్ రాష్ట్ర జట్టులో భీమవరం క్రీడాకారులు

భీమవరం అర్బన్, మే 18, (ఆంధ్రజ్యోతి) : 7వ ఖేలో ఇండియా యూత్ గేమ్స్ మల్లకంబ్ జట్టులో భీమవరానికి చెందిన 9 మంది క్రీడాకారులు రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు శేఖర్ రాజు తెలిపారు. భారత ప్రభుత్వం, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈనెల 5వ తేదీ నుంచి 8వ తేదీ వరకు బిహార్ రాష్ట్రంలోని బుద్ధగయలో జరిగాయన్నారు. ఈ క్రీడల్లో మొత్తం 12 మంది క్రీడాకారుల రాష్ట్రజట్టు ఎంపికవగా దానిలో ఐగురు బాలికలు, నలుగురు బాలురు భీమవరానికి చెందిన వారు కావడం విశేషం అన్నారు.

ఆలోచింపజేసిన నాటికలు

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో నిర్వహిస్తున్న జాతీయస్థాయి తెలుగు నాటిక పోటీలు ఎంతగానో అలరిస్తున్నాయి. ప్రేక్షుకులను ఆలోచింప చేశాయి. ఆదివారం ప్రదర్శించిన గోవాడ క్రియేషన్స్ హైద్రాబాద్ వారిచే అమ్మ చెక్కిన బొమ్మ, కృష్ణా ఆర్ట్స్ కల్చరల్ అసోసియేషన్ గుడివాడ వారిచే ద్వార బంధాల చంద్రయ్య నాయుడు నాటికలు ఆకట్టుకున్నాయి.నాటకోత్సవాలకు విచ్చేసిన రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ నాటక రంగ కళాకారులకు కూడా నంది అవార్డులు అందిస్తామని చెప్పారు.

రక్తి కట్టించిన ద్వార బంధాల చంద్రయ్య

బ్రిటీష్ పాలకులకు పక్కలో బల్లెమైన మన్యం విప్లవ వీరుడు ద్వార బంధాల చంద్రయ్య ఉత్తేజకర, స్ఫూర్తిదాయక పోరాట గాథను కృష్ణ ఆర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్, గుడివాడ కళాకారులు అద్భుతంగా ప్రదర్శించారు. పది పన్నెండు మంది బాలలు, సహా 30 మంది నటులతో రక్తి కట్టించారు.



అమ్మ చెక్కిన బొమ్మ నాటికలో సన్నివేశం

అమ్మ చెక్కిన బొమ్మ

ఓ ట్రాన్స్‌జెండర్ వాస్తవగాథ అమ్మ చెక్కిన బొమ్మ నాటిక ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. గోవాడ క్రియేషన్స్, హైద్రాబాద్ కళాకారులు ఉత్తమ ప్రదర్శన కనబరిచారు. భావోద్వేగాలకు తోడు గాఢమైన సందేశాన్ని అందించింది. ఎన్నో అవమానాల్ని అధిగమించి, ఉన్నత చదువులు చదవి ప్రస్తుతం మంచిస్థాయిలో ఉన్న ట్రాన్స్‌జెండర్ వృత్తాంతమే ఈ నాటిక. అనంతరం సాహితీవేత్త ప్రొఫెసర్ వెల్చేర్ నారాయణరావుకి గిడుగు రామ్మూర్తి, సాహిత్య పురస్కారాన్ని ప్రదానం చేశారు.

బెజవాడ దుర్గమ్మవు.. పోడూరు గరగలమ్మవు నీవే..

పోడూరు, మే 18(ఆంధ్రజ్యోతి): పోడూరు గ్రామదేవత గరగలమ్మ అమ్మవారి జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అమ్మవారిని కూరగాయలతో ప్రత్యేకంగా అలంకరించారు. గ్రామానికి చెందిన కూరగాయల వర్తకుడు మండ నాగరాజు కుమారులు బాల వెంకటకృష్ణ, చైతన్యలు 320 కేజీలు కూరగాయలు, 70 కేజీల కరివేపాకు, ఆకుకూరలు, పండ్లతో అమ్మవారిని అలంకరించారు. 21న అమ్మవారికి జాతర నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.



రూ.4900 కోట్లు

డీసీసీబీ రుణ లక్ష్యం ఖరారు

5.9 లక్షల మంది పైబడి రైతులకు రుణం

డిపాజిట్ల పెంపు లక్ష్యం రూ.100 కోట్ల పైబడే

(ఏలూరు-ఆంధ్రజ్యోతి), మే 18 : రానున్న ఖరీఫ్, రబీల్లో రైతులకు మరింత చేరువగా రుణాలను అందించేందుకు సొసైటీలు సమాయత్తం అవుతున్నాయి. ఆరుగాలం పంటలు పండించే రైతులకు ఉమ్మడి జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) రానున్న ఆర్థిక సంవత్సరంలో రూ.4900 కోట్ల సత్వర పంట రుణాలను ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాలు ఉమ్మడిగా 34 బ్యాంకు బ్రాంచిల కింద 258 సొసైటీల కింద రుణాలను ప్రతీ రెండు పంటల కాలాలకు రైతులకు డీసీసీబీ సమకూర్చేది. అయితే ఈ సంస్థను ఆర్థిక నష్టాలను వెంటాడుతున్నప్పటికీ రైతుల సంక్షేమమే ధ్యేయంగా ఇటీవల పెంచిన పెట్టుబడి సాయం పరిమితికి లోబడి అతికష్టం మీద రూ.4900 కోట్ల రుణాలను ఇచ్చి తీరాలని ఇటీవల లక్ష్యంగా నిర్ణయించుకుంది. ఏలూరు జిల్లాలో 2,50,465 మంది రైతులు పశ్చిమ గోదావరి జిల్లాలో 3,40,233 మంది రైతుల కలిపి మొత్తం 5 లక్షల 90 వేల 598 మంది పంట రుణాలను ఏటేటా పొందుతున్నట్లు సమాచారం. ప్రతీ సొసైటీలో గతంలో ఇచ్చిన రుణం కంటే ఈసారి 15 శాతం అదనంగా రుణాలను ఇచ్చి తీరాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ సంస్థకు 1982 కోట్ల డిపాజిట్లు చేతిలో ఉన్నాయి. రానున్న ఆర్థిక సంవత్సరంలో దీన్ని 2280 కోట్ల డిపాజిట్లను పెంపు లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. అంటే దాదాపుగా ఏడాది కాలంలో 100 కోట్ల డిపాజిట్లను సేకరించడం ద్వారా రుణాల అందజేతకు ముందడుగు వేయనుంది. సీనియర్ సిటిజన్లకు డిపాజిట్లపై 8.25 శాతం, ఇతర వర్గాలకు 7.75 శాతం వడ్డీని డీసీసీబీ చెల్లిస్తోంది.

మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి

రైతులు సొసైటీల వారీగా సత్వరం రుణాలను అందజేయాలంటే డీసీసీబీ మొండి బకాయిలు వసూళ్లు కీలకమే. స్వల్పకాలిక, దీర్ఘకాలిక రుణాల కింద గడచిన మార్చి నాటికి 260 కోట్లు బకాయిలు వసూలు చేయాల్సి ఉంది. ఎట్టి పరిస్థితుల్లోనే మార్చి 2026 అంతానికి రూ.50 కోట్ల అయినా వసూళ్ల పురోగతి సాధించాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. వరి, మొక్కజొన్న, ఇతర పంటలు రైతులకొచ్చే సమయం అయినందున ఆశించిన మేర పురోగతి సాధిస్తామని అధికారులు చెబుతున్నారు. ప్రతీ సొసైటీలో రైతులకు సత్వరం అడిగిన వారి రుణం అందివ్వడానికి సన్నద్ధంగా ఉన్నామని జిల్లా సహకార కేంద్రబ్యాంకు సీఈవో సింహాచలం తెలిపారు. ఆర్థికంగా నష్టాల్లో ఉన్న రైతులే ధ్యేయంగా తమ బ్యాంకు బ్రాంచిలు పనిచేస్తాయని వివరించారు.





వట్లూరు సీఆర్ఆర్ కళాశాలలో పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు ..కళాశాల వద్ద తల్లిదండ్రుల ఆందోళన

జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ప్రశాంతం

ఏలూరు అర్బన్/ తాడేపల్లిగూడెం రూరల్/ భీమవరం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి) : జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఆదివారం ప్రశాంతంగా ముగిసింది. ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్షకేంద్రానికి మొత్తం 180 మంది విద్యార్థులను కేటాయించగా ఉదయం షిఫ్టులో జరిగిన పేపర్-1 పరీక్షకు 175 మంది, మధ్యాహ్నం షిఫ్టులో జరిగిన పేపర్-2 పరీక్షకు 174 మంది హాజరయ్యారు. సిద్దార్థ క్వెస్ట్ సీబీఎస్ఈ స్కూలుకి 144 మంది విద్యార్థులను కేటాయించగా రెండు షిఫ్టుల్లోను 140 మంది హాజరయ్యారు. పరీక్ష నిర్వహణను టీసీఎస్ పర్యవేక్షించింది. తాడేపల్లిగూడెం పట్టణంలోని శశి ఇంజనీరింగ్ కళాశాలలో ఉదయం, సాయంత్రం రెండు పరీక్షల్లో 240 మందికి గాను 238 మంది పరీక్షలు రాయగా పెదతాడేపల్లి వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో రెండు పూటల జరిగిన పరీక్షలకు 136 మందికి 135 మంది పరీక్షలు రాశారు. భీమవరం డీఎన్నార్ ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రంలో 128 మంది విద్యార్థులకు 120 మంది హాజరయ్యారు.

వట్లూరు పరీక్ష కేంద్రంలో వసతుల లేమిపై తల్లిదండ్రుల ఆందోళన

ఎన్‌టీఏ, ఎన్టీయే నిర్వహించే జాతీయస్థాయి పోటీ పరీక్షలు సాధారణంగా ప్రతిష్టాత్మక ఏజెన్సీల ఆధ్వర్యంలో జరుగుతుంటాయి. ఆన్‌లైన్ విధానంలో జరిగే ఈ పరీక్షలకు సొంత కేంద్రాలు లేనిచోట జిల్లాల వారీగా అన్ని వసతులున్న విద్యాసంస్థల్లో పరీక్షల విభాగాలను లీజు ప్రాతిపదికన నిర్వాహకులు తీసుకుంటారు. ఇందుకు సంబంధిత విద్యాసంస్థకు నిర్ణీత మొత్తాన్ని రీయింబర్స్‌మెంట్‌రూపంలో నిర్వాహకులు చెల్లిస్తుంటారు. ఆ మేరకు ఆన్‌లైన్ పరీక్ష కేంద్రాల్లో ఏసీ సౌకర్యం విద్యార్థులకు కల్పించాల్సి ఉంటుందని చెబుతున్నారు. తాజాగా ఆదివారం జరిగిన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్షకు వట్లూరులోని ఓ పరీక్ష కేంద్రంలో విద్యార్థులకు ముచ్చెమటలు తప్పలేదని తల్లితండ్రులు ఆరోపించారు. రాయలసీమ, శ్రీకాకుళం, తదితర సుదూర ప్రాంతాల నుంచి ఇక్కడి కేంద్రానికి పరీక్ష నిమిత్తం తల్లితండ్రులతో సహా సామాగ్రిని వెంటబెట్టుకుని ఆదివారం ఉదయాన్నే వచ్చిన విద్యార్థులకు ముప్పుతిప్పలు ఎదురయ్యాయి. పరీక్షకు విద్యార్థులు వెళ్లిపోగా, సమీప ప్రాంతంలో నిలువనీడకూడా లేకపోవడంతో పరీక్ష కేంద్రం ప్రాంగణంలో చెట్లకింద వేచి ఉండటానికి ప్రయత్నించిన తల్లితండ్రులను నిర్వాహకులు వెళ్లగొట్టడంతో నిరసనకు దిగారు. మధ్యాహ్నం జరిగిన పేపర్-2 పరీక్షకు సకాలంలో హాజరయ్యేందుకు వీలుగా ముందుగానే భోజనం బాక్సులను వెంట తెచ్చు కున్నప్పటికీ ప్రాంగణంలో తినడానికి వీలు లేదనడంతో వాగ్వాదం నెలకొంది. మహిళలనైతే కనీస అవసరాలను తీర్చుకునేందుకు కూడా అనుమతించకపోవడంతో పేరెంట్స్ కొద్దిసేపు ఆందోళనకు దిగారు. ఊరికి దూరంగా మారుమూల ప్రాంతంలో పరీక్షకేంద్రానికి అనుమతివ్వడంపై ఆగ్రహావేశాలు వ్యక్తం చేశారు. దీనిపై విద్యాసంస్థ ప్రతినిధులు వివరణిస్తూ 'పరీక్ష నిర్వహణ, సౌకర్యాలు కల్పించడం లేదా పర్యవేక్షించడం నిర్వాహకుల బాధ్యత. ఇందులో విద్యాసంస్థకు ఎటువంటి సంబంధం లేదు.' అని తెలిపారు.

కోకో రైతులకు మద్దతు ధర ఏదీ ?

కిలో రూ.300 నుంచి రూ.430

ధర తగ్గించేస్తున్న కంపెనీలు

ఆందోళన బాటలో రైతులు

దెందులూరు మే 18 (ఆంధ్రజ్యోతి) : కోకో కంపెనీలు గత ఆరు నెలల నుంచి కోకో రైతులను, కౌలు రైతులను తీవ్ర మనోవేదనకు గురిచేస్తున్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో కోకో గింజలు కేజీ 950 వరకు ఉన్నప్పటికి కోకో కంపెనీలు మాత్రం రైతులకు క్షేత్రస్థాయిలో రూ.400 నుంచి రూ.450 వరకే మద్దతు ధర చెల్లిస్తున్నాయి. వారం రోజులుగా దెందులూరు నియోజకవర్గంలో రైతులు దెందులూరు మండలంలోని సోమవరప్పాడు జాతీయ రహదారి వద్ద పెద్ద ఎత్తున నిరసన తెలుపుతున్నారు.

జిల్లాలో కోకో పంటలను సుమారు 35 వేల ఎకరాల్లో సాగు చేస్తుండగా అందులో దెందులూరు నియోజకవర్గంలోనే 24 వేల ఎకరాల్లో సాగు చేస్తున్నారు. 2022 సంవత్సరంలో కోకో కేజీ ధర రూ.300 నుంచి 350 రూపాయలు ఉండగా అప్పుడు ఎకరానికి రూ.40 వేలు కౌలుకు తీసుకునేవారు. కోకో పంటకు అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ పెరగడం, ఒక్కసారిగా కేజీ రూ.1040 చేసి కొనుగోలు చేయడంతో కౌలు రైతులు అప్పట్లో లాభాలు గడించారు. కౌలుకు తీసుకునేందుకు రైతులు పెద్ద ఎత్తున ఆసక్తి చూపించారు. పోటీ పెరగడంతో ఎకరం రూ.40 వేల నుంచి రూ.లక్ష వరకు కూడా వెళ్లింది. అయితే ప్రస్తుతం రూ.380 నుంచి 440 వరకు కొనుగోలు చేస్తుండటంతో నష్టాలను చూడాల్సివచ్చింది. ఎమ్మెల్యే చింతమనేని, మంత్రి పార్థసారధిలు ఈ సమస్యను సీఎం దృష్టికి తీసుకు వెళ్లగా కనీస మద్దతు ధర రూ.500లకు తగ్గకుండా ఇవ్వాలని ఆదేశించారు. అయినా కంపెనీలు ధర పెంచగపోగా రూ.50 తగ్గించారు. దీంతో రైతులు ఆందోళనకు దిగారు.



ఆరబోసిన కోకో పంట గింజలు

మద్దతు ధర ఇవ్వకపోతే నష్టం



నాకు ఉన్న 6 ఎకరాల్లో కోకో పంట వేశాను. పురుగు మందులు, ఎరువులు, కూలీల రేట్లతో పాటు పెట్టుబడులు పెరిగిపోయాయి. కేజీ ధర కనీసం రూ.950 తగ్గకుండా కోకో కంపెనీలు అందించాలి. అంతర్జాతీయ మార్కెట్‌లో ధర ఎంత ఉంటే అంతయినా ఇవ్వాలి.

నరసింహరావు, రైతు,కొండలరావుపాలెం

రూ.900 తగ్గకుండా ఇవ్వాల్సిందే..



నాకు ఉన్న సొంత భూమితో పాటు కొంత కౌలు తీసుకుని కోకో సాగు చేపట్టాను. ప్రస్తుతం ధర రూ.400 ఉంది. కనీసం కౌలు కుడా రాదు. రూ.900 తగ్గకుండా ఇవ్వాల్సిందే. లేకపోతే రైతులు తీవ్రంగా నష్ట పోతారు.

కోనేరు సతీష్‌బాబు, రైతు,విజయరాయి

ధర ఇవ్వకపోతే రాష్ట్ర వ్యాప్త ఆందోళన

కోకో పంటలకు అంతర్జాతీయ మార్కెట్ ధర ప్రకారం మద్దతు ధర ఇత్వాలి లేక పోతే కోకో రైతులు,కౌలు రైతులు తీవ్రంగా అప్పులు పాలైపోతారు.కోకో కంపెనీలు కోకో రైతులను పట్టించుకోకుండా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతాం. కోకో రైతుల న్యాయమైన డిమాండ్‌లను కోకో కంపెనీలు తీర్చాలి. కనీసం 900 మద్దతు ధరతో కొనుగోలు చేసే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.



- కె.శ్రీనివాస్, రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

పదోన్నతి తరువాతే నిర్ణయం తీసుకోవాలి

ఏలూరు రూరల్, మే 18 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ అధికారులకు పదోన్నతి కల్పించిన తరువాతే క్లస్టర్ విధానంపై సరైన నిర్ణయం తీసుకోవాలని రాష్ట్ర రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామ వార్డు సచివాలయాల రేషనలైజేషన్ పేరుతో స్పెసిఫిక్ పర్పస్, టెక్నికల్ పర్పస్‌కి సంబంధించి క్లస్టర్ విధానంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒక సచివాలయానికి ఒక వీఆర్వోని కేటాయిస్తూ, మరొక సచివాలయానికి సర్వే అసిస్టెంట్‌ను కేటాయించారన్నారు. ఇలా చేయడం వలన రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 7500 మంది గ్రామ రెవెన్యూ అధికారులను మిగులు సిబ్బందిగా చూపించారన్నారు. రేషనలైజేషన్ ప్రక్రియ మొదలు పెట్టిన రోజు నుంచి క్లస్టర్ల విధానంలో అసంబద్ధత కారణాలతో భవిష్యత్‌లో జరిగే పరిణామాలపై ముం దుగానే రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, చీఫ్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్ళామన్నారు. వీఆర్వోలకు ప్రమోషన్ కల్పించిన తరువాత మాత్రమే క్లస్టర్ విధానంపై తీసుకోవాలని కోరడం జరిగిందన్నారు. తమతో స్పందించకుండా, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా జీవో నెం.4 విడుదల చేయడం పట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పుడు క్లస్టర్ విధానంలో 50 శాతం వీఆర్వోలు తగ్గిపోతున్నారని, క్లస్టర్ విధానంలో పనిచేయాలంటే పని భారం బాగా పెరుగుతుందని, మిగిలిన వీఆర్వోలకు ఏ బాధ్యతలు చెబుతారోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారన్నారు. అందువలన జీవో నెం.4 ద్వారా తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు.

అత్తింటి వేధింపులకు వివాహిత బలి



ఏలూరు క్రైం, మే 18 (ఆంధ్రజ్యోతి) : కట్టుకున్న భర్తతో పాటు అత్తింటివారి వేధింపులు భరించలేక ఒక యువతి తన పుట్టింట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఏలూరు కొత్తపేటకు చెందిన పుచ్చల వెంకటేశ్వరరావు న్యాయవాదిగా వృత్తిని కొనసాగిస్తున్నారు. ఆయన కుమార్తె పుచ్చల కృష్ణసంగీతను గత ఏడాది డిసెంబర్ 5వ తేదీన విశాఖపట్టణంలోని శివాజీపాలానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి నక్కిన శశికిరణ్‌కు ఇచ్చి వివాహం చేశారు. కృష్ణ సంగీత (29) ఏలూరు ఎన్ఆర్‌పేట పోస్టాఫీస్‌లో పోస్టల్ అసిస్టెంట్‌గా ఉద్యోగం చేస్తున్నారు. ఆమె భర్త ఉద్యోగం మానేసి ఇంట్లోనే ఉంటున్నాడు.సంగీత తన ఖర్చులకు ఉంచుకుని మిగిలిన జీతం భర్తకు పంపిస్తున్నది. మొత్తం జీతం ఇచ్చేయాలని ఏలూరు నుంచి విశాఖ పట్టణం బదిలీ చేసుకుని రావాలని భర్త వేధించగా అదనపు కట్నం తీసుకురావాలంటూ ఆమె అత్త నాగేశ్వరిదేవి వేధిస్తున్నారు. వారి వేధింపులు భరించలేక ఆమె మానసిక వేదనకు గురై ఆదివారం మధ్యాహ్నం తన ఇంట్లోనే ఉరి వేసుకుంది. కుటుంబ సభ్యులు వెంటనే ఆమెను ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తీసుకురాగా అత్యవసర వైద్యులు ఆమెను పరీక్షించి ఆమె మృతి చెందిందని నిర్ధారించారు. ఆసుపత్రి వైద్యులు ఎమ్మెల్సీగా నమోదు చేసి ఆసుపత్రి ఔట్‌పోస్టు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాన్ ఢీకొని వ్యవసాయ కూలీ మృతి



గణపవరం, మే 18 (ఆంధ్రజ్యోతి): గణపవరం మండలం సరిపల్లె గ్రామ శివారు సీపీఎఫ్ ఫ్యాక్టరీ సమీపంలో ఆదివారం రాత్రి మినీ ఐషర్ వ్యాన్‌ను ఢీకొట్టిన సంఘ టనలో గంటా సాల్మన్ (60) అక్కడికక్కడే మృతి చెందాడు. గణపవరం ఎస్సై మణికుమార్ తెలిపిన వివరాల ప్రకారం ఉండి మండలం కలిగొట్ల గ్రామానికి చెందిన గంటా సాల్మన్ వ్యవసాయ కూలీగా పని చేస్తాడు. ఆదివారం రాత్రి సుమారు 7 గంటల సమయంలో గణపవరం నుంచి కలిగొట్ల మోటర్ సైకిల్ పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న మినీ ఐసర్ వ్యాన్‌ను ఢీకొట్టగా సాల్మన్ అక్కడికక్కడే మృతి చెందాడని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఉండి, మే 18 (ఆంధ్రజ్యోతి): పనికి వెళ్లడం లేదని తల్లిదండ్రులు మందలించడంతో పురుగులమందు తాగి చికిత్స పొందుతున్న యువకుడు మృతిచెందాడు. ఉండి మండలం కోలమూరు గ్రామానికి చెందిన కుడిపూడి సత్యశేఖర్ (22) మోటర్ వైండింగ్ నేర్చుకుంటున్నాడు. రెండురోజుల నుంచి వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. దాంతో అతను ఈనెల 15న పురుగుల మందు తాగాడు. భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి, అక్కడ నుంచి ఏలూరు, తదుపరి గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి మెరుగైన వైద్యం నిమిత్తం తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం ఉదయం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తున్నట్లు ఎస్ఐ నజీరుల్లా తెలిపారు.

ఆడుకుని వచ్చేస్తాం నాన్నా..

వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లి ఇద్దరు చిన్నారులు మృతి

బుట్టాయగూడెం జల్లేరు జలాశయంలో పడి మృత్యువాత



చిన్నారుల మృతదేహాలను బయటకు తీసుకు వస్తున్న బంధువులు



సిద్దిక్, మజీద్ (ఫైల్ ఫొటో)

బుట్టాయగూడెం/ తాడేపల్లిగూడెం రూరల్ మే 18 (ఆంధ్రజ్యోతి): ఆడుకుని వచ్చేస్తాం..నాన్నా అని వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వెళ్లిన ఇద్దరు చిన్నారులు తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయారు. పిల్లల భవిష్యత్ కోసమే ఆశతో జీవిస్తున్న ఆ తల్లిదండ్రులకు పిల్లలిద్దరూ ఒకేసారి మృతి చెందడంతో ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. నిన్నటివరకూ ఆడుతూ పాడుతూ తిరిగిన ఆ చిన్నారులు వేసవి సెలవులకు వెళ్లి వస్తామని చెప్పి తిరిగి రానికి లోకాలకు వెళ్లిపోవడంతో వారి కనీళ్లను ఆపడం ఎవరితరమూ కాలేదు.. తాడేపల్లిగూడేనికి చెందిన షేక్ అన్వర్, ఫర్వీన్ దంపతులకు సిద్దిక్ (11) అబ్దుల్ (7) ఇద్దరు కుమారులు. తండ్రి అన్వర్ తాడేపల్లిగూడెంలో ఫుట్‌పాత్‌పై బట్టలు, ఫ్యాన్సీషాపు నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. సెలవులు కావడంతో పిల్లలను తీసుకుని తల్లి ఫర్వీన్ రెండు రోజుల క్రితం పుట్టిల్లు అయిన ఏలూరు జిల్లాలోని జంగారెడ్డిగూడెం వెళ్లారు. ఆదివారం పిల్లలు మారాం చేయడంతో బుట్టాయగూడెం మండలంలోని జల్లేరు జలాశయం చూడటానికి వెళ్లారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఇద్దరు పిల్లలు జలాశయంలో దిగి ఆడుకుంటూ కాస్తంత ముందుకు వెళ్లారు. లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాద వశాత్తు జలాశయం నీటిలో మునిగి చనిపోయారు. పోలీసులకు సమాచారం అందడంతో ఈతగాళ్లను పిలిచి చిన్నారుల మృతదేహాలను బయటకు తీశారు. పోస్టుమార్టం కోసం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.ఎస్ఐ దుర్గా మహేశ్వ రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తు న్నారు. వేసవి సెలవులకు అమ్మమ్మ ఇంటికి వచ్చి తిరిగిరాని లోకాలకు వెళ్ళిన చిన్నారులను చూసిన ప్రతిఒక్కరూ కంటితడి పెడుతున్నారు. చిన్నారులను కోల్పోయిన కుటుంబం కన్నీరు పెడుతుండగా వారిని వారించడం ఎవరితరం కావడం లేదు. వేసవి సెలవులు ఆ.. కుటుంబంలో తీరని విషాదాన్ని నింపాయి.



పొట్టన పెట్టుకున్న జలాశయం

క్రికెట్ బెట్టింగ్ కేసులో పురోగతి : పాలకొల్లు సీఐ

పాలకొల్లుఅర్బన్, మే 18 (ఆంధ్రజ్యోతి): పట్టణ పోలీస్ స్టేషన్‌లో నమోదైన క్రికెట్ బెట్టింగ్ కేసులో పురోగతి సాధించామని పాలకొల్లు సీఐ కోలా రజనీకుమార్ తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మినరసాపురం డీఎస్పీ డాక్టర్ శ్రీవేదల పర్యవేక్షణలో గత నెల 20 వతేదీన క్రికెట్ బెట్టింగ్ ముఠాను పట్టుకున్నామన్నారు దీనిలో ఎ-3 యడ్ల నాగేశ్వరరావు, ఎ-4 వైసీపీ నాయకుడు యడ్ల తాతాజీ (సోదరులు) బ్యాంక్ ఖాతాల్లో భారీగా నగదు లావాదేవీలు జరిగినట్టు గుర్తించామని తెలిపారు. దీనిలో ఎ-3 బ్యాంక్ అకౌంట్‌లో రూ.23 కోట్లు లావాదేవీలు జరిగినట్టు గుర్తించామన్నారు. నిందితుల బంధువుల బ్యాంక్ లావాదేవీలు, ఆస్తుల సమాచారం కూడా సేకరిస్తున్నామన్నారు. యువత ఆన్‌లైన్ బెట్టింగ్ జోలికి వెళ్ళి మోసపోరాదన్నారు.డబ్బు పోగొట్టుకుని ఆత్మహత్యలు, హత్యలకు పాల్పడుతున్న సంఘటనలు కూడా జరుగుతున్నాయన్నారు. జూదాలను నిర్మూలించడానికి ప్రజలు, ముఖ్యంగా యువత సహకరించాలని కోరారు. సమావేశంలో ఎస్ఐ పాల్గొన్నారు.



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ రజనీ కుమార్, ఎస్ఐ ప్రసాద్